# మోసగాడు

రచన :

శ్రీ పట్నాయక్

కాకినాడ - పార్వతీపురం ఎక్స్‌ప్రెస్ బస్సునుండి అప్పుడే దిగాడు శేఖర్. మెడలో ఎయిర్‌బేగ్ చేతిలో బ్రీఫ్‌కేస్‌తో రోడ్డుపై నిలబడ్డాడు. అది బస్‌స్టాండు కాబట్టి మనుషులతో బస్సులతో రద్దీగా వుంది. చుట్టూ చూశాడు. రిక్షాలు కనబడకపోవడంతో రెండు అడుగులు ముందుకు వేశాడు. తనకు ఎదురుగా ఒక రిక్షా రోడ్డులో దూసుకువస్తుంది. శేఖర్ని చూసి రిక్షాడ్రైవరు ఒక్కసారి బ్రేక్ వేసాడు. 'సార్ రిక్షా కట్టమంటారా ?' అని అడిగాడు రిక్షాడ్రైవరు. 'రిక్షా కట్టుదువుగాని నీకు వేణుమాష్టారు ఇల్లు తెలుసా?' అని అడిగాడు శేఖర్. 'ఏ వేణుమాష్టారు ?' అని ప్రశ్నించాడు రిక్షాడ్రైవరు. 'ఇక్కడ మునిసిపల్ హైస్కూలులో పని చేస్తున్నారు ఆ వేణుమాష్టారు' అన్నాడు శేఖర్.

'ఆఁ.... వేణుమాష్టారా ? తెలుసులెండి. మీరు ఆయన స్నేహితులా ?' అని అడిగాడు రిక్షాడ్రైవర్. 'ఆయన స్నేహితుడునే' అని సమాధానమిచ్చాడు శేఖర్. 'అయితే మీరు ఈవూరికి కొత్తలా వున్నారు' నవ్వుతూ అడిగాడు రిక్షాడ్రైవరు అమాయకత్వంతో. 'అవును' అని అసలు గుట్టు బయటపెట్టాడు శేఖర్. 'రిక్షా ఎక్కి కూర్చోండి. ఎంతదూరమో మీరు చూస్తారుగా, ఆ కష్టానికి ఫలితంగా డబ్బు ఇద్దురు' అన్నాడు నిజాయితీగా రిక్షాడ్రైవరు. మెడలో ఎయిర్‌బేగ్ చేతిలో బ్రీఫ్‌కేస్ రిక్షాలోవుంచి రిక్షా ఎక్కాడు శేఖర్.

రిక్షా కదిలింది. స్పీడు పెంచుకుంటుంది. 'బాబు మీది ఏవూరు ?' అని ప్రశ్నించాడు రిక్షాడ్రైవరు. 'మావూరు కాకినాడ. అలా ఫ్రెండ్‌ని చూసిపోదామని వచ్చాను' అన్నాడు శేఖర్. 'బాబు ఈవూరిలో ప్రతీది మోసమే. మొన్న మా రిక్షాడ్రైవర్ల దగ్గరకు ఒకడువచ్చి లాటరీ టికట్లు అమ్మాడు. ఆశతో మేమంతా కొన్నాం. మాకు చదువు రాదుకదా బాబు. మీలాంటోలు రిక్షా ఎక్కినప్పుడు ఆశతో ఎన్నిలక్షలు పెలతాది అని చూపించాను. నీకేం పిచ్చి పట్టిందా ఇది సంవత్సరంక్రింద టికెట్టు అన్నాడాబాబు. నాకు ఎక్కడలేని ఆవేశం వచ్చింది ఆమాట విన్నాక. రాత్రింబవళ్ళు కష్టపడి సంపాదించే సొమ్ము మన్నులా తీసుకున్నాడు బాబు ఆ మోసగాడు, అదికాదు బాబు నిన్న దైవదర్శనం చేసుకోడానికి కోవిలికి వెళ్ళాను. పైన కొందరు పిల్లలు చెప్పులు వుంచుతాం అన్నారు. పోనీకదా అని ఇచ్చాను. దైవదర్శనం చేసుకొని పైకి వచ్చాను. నేను చెప్పులు ఇచ్చే కుర్రవాడు లేడు. ఆ మోసం చూశాక మోసమన్నది పెద్దలకే పరిమితం కాదన్నాను. చూడండి, ఎలా ఈవూరు మోసాలతో నిండివుందో ?' అన్నాడు రిక్షాడ్రైవరు. 'ఈ మోసం అన్నది మీవూరికే పరిమితం అనుకుంటున్నావా ? నువ్వు ఇంత అమాయకత్వంతోవుంటే ఎలా జీవితం గడపగలవు. ఒకప్పుడు దేవుడు అందరి మనసుల్లో వుండేవాడు. కాని ఇప్పుడు మోసం అన్నది అందరి మనస్సుల్లో వుంటుంది. నీలాంటి అమాయకుడు ఈలోకంలో బ్రతకలేడు' నవ్వుతూ అన్నాడు శేఖర్.

'బాబు ఇలాంటి మోసం, దగా, అన్యాయం అంటే పడదు నాకు. అప్పుడెప్పుడో చెప్పారుగా మన గాంధీగారు, శాంతి అహింస అని. అవంటే నాకు ప్రాణం' అని అమాయకంగా అన్నాడు రిక్షాడ్రైవరు.

'నీలాంటి నిజాయితీ మనుషులు దేశంలో పదిమంది వుంటే చాలు. దేశం ఎప్పుడో బాగుపడేది. నీలాంటివారు ఈదేశంలో కొరతై మోసం నిండిపోయింది. నీలాంటి నిజాయితీమనుషులు, కార్మికులు కంకణం కట్టుకొని ఈ మోసాన్ని పారద్రోలాలి. ఎప్పుడైతే ఈ మోసంపోతుందో అప్పుడే దేశం మూడుపువ్వులు ఆరుకాయలుగా కలకలలాడుతుంది' అని తన లెక్చర్ని ఆపాడు శేఖర్.

వీధులు దాటిపోతున్నాయి, రిక్షాడ్రైవరు మంచి మనసుకు, నిజాయితీకు మనసులో పొగడుతున్నాడు శేఖర్. వేణుమాష్టారు ఇల్లు రానే వచ్చింది. శేఖర్ రిక్షాదిగి తను స్టాండునుండి వచ్చేదారి జ్ఞాపకం తెచ్చుకుంటూ జేబులో మూడురూపాయలు తీసి ఇచ్చాడు రిక్షాడ్రైవర్‌కి. 'సరిపోతుందా ?' అని అడిగాడు శేఖర్. 'మీదయ. సరిపోతుంది' అని సమాధానమిచ్చాడు రిక్షాడ్రైవరు. ఇచ్చేడబ్బు తీసుకొని మారుమాట పలకకుండా వెళ్ళిపోయాడు. ఎంత నిజా

యితీమనిషి అంటూ వేణుమాష్టారి కాలింగ్‌బెల్ స్విచ్ నొక్కాడు శేఖర్.

కాలింగ్‌బెల్ శబ్దంతో తలుపు తీశారు వేణుమాష్టారు. 'హల్లో శేఖర్. ఎప్పుడు రాక ?' నవ్వుతూ పలకరించాడు వేణుమాష్టారు.

నేను ఇప్పుడే వచ్చాను అంటూ ఇంట్లోనికి వెళ్ళాడు శేఖర్. సోఫాలో కూర్చుని ఇద్దరూ పిచ్చిపాటి మాటలు స్టార్ట్ చేసారు. 'ఒరే వేణు మీవూరి రిక్షాడ్రైవర్లలో ఎంత నిజాయితీ. బేరమాడలేదు. ఎంత నచ్చితే అంత డబ్బు ఇవ్వండి. మా కష్టాన్ని చూసేగా మీరు నాకు డబ్బులిచ్చేది అని రిక్షాడ్రైవరు అన్నాడు. అయినా నువ్వు స్టాండుకు ఇంతదూరంలో ఇల్లు తీసుకొన్నావు, చుట్టాలు ఎవరొచ్చేస్తారో అని భయమా ?' నవ్వుతూ అడిగాడు శేఖర్.

'రిక్షాడ్రైవర్ల నిజాయితీ ఏమిటి ? నేను చుట్టాలకు భయపడడమేమిటి ? స్టాండుకు దూరంలో మా యిల్లు యేమిటి ? నువ్వు నాతో జోక్ చేస్తున్నావేమిటి' నవ్వుతూ అడిగారు వేణుమాష్టారు.

'నేను జోక్ చెయ్యడం లేదు. నాలుగువీధులు దాటుకుని వచ్చాను. ఆ రిక్షాడ్రైవరు నిజాయితీ మనిషి కాబట్టి నన్ను ఇక్కడికి తీసుకొచ్చాడు. నేనే నడుచుకొనివస్తే సుమారు మూడుగంటలు పట్టివుండేది' సీరియస్‌గా అన్నారు శేఖర్.

'రిక్షావాడికి ఎంత ఇచ్చావు ? మూడురూపాయలా ? నాలుగురూపాయలా ?' నవ్వుతూ అన్నాడు వేణుమాష్టారు.

'మూడురూపాయలు ఇచ్చాను' అన్నాడు శేఖర్.

'నువ్వు మోసపోయావురా ! ఈ వీధి టర్నింగ్‌లోనే స్టాండ్ ఎదురౌతుంది' అని ఇంకా పెద్దగా నవ్వారు వేణుమాష్టారు.

'తను నిజాయితీమనిషి అనుకొనే మనిషి మోసగాడా ? గాంధీగారి శాంతి అహింసలు నా ప్రాణం అనే మనిషి మోసగాడా ? అనే ప్రశ్నలు నిముష నిముషానికి శేఖర్ మనసులో ప్రతిధ్వనిస్తున్నాయి. తనకు నిజాయితీగా కన్పించే రిక్షాడ్రైవరు ఇప్పుడు నీతిని, శాంతిని, అహింసని సమాధికట్టి మోసాన్ని పూజిస్తున్న మనిషిలా కనిపించాడు. కాని ఏమి లాభం. లోకంలో మోసగాళ్ళసంఖ్య ఎక్కువై పోయింది. ఆ మోసగాళ్ళలో ఈ రిక్షాడ్రైవరు ఒక మోసగాడు' అని మనసులో తిట్టుకుంటూ వేరే మాటల్లోనికి దిగిపోయాడు శేఖర్.



Regd. No.
6233




Phone :
21852

కలర్ బనియన్లు, ♦ డోరియా, ♦ జెట్టీలు.